



కాసు బ్రహ్మానందరెడ్డి


రోశయ్య


జనార్ధనరెడ్డి


మద్ది సుదర్శనం


కోట సైదయ్య


కాసు కృష్ణారెడ్డి


మేకపాటి


మోదుగుల


రాయపాటి


ప్రస్తుత ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



- మొత్తం ఓట్లు: 17,12,829
- పురుషుల ఓట్లు: 8,37,200
- మహిళల ఓట్లు: 8,75,433
- ఇతరుల ఓట్లు: 196

2024 సార్వత్రిక ఎన్నికల సమరం సమీపిస్తోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. ఆయా పార్టీల ప్రచారాలు ఊపందుకున్నాయి. ఈ సారి షెడ్యూల్‌కు పోలింగ్‌కు మధ్య వ్యవధి 65 రోజులు వచ్చింది. అంటే సుమారు రెండు నెలలకు పైగా ప్రచారాలు నిర్వహించుకునే అవకాశం అభ్యర్థులకు వచ్చింది. అయితే ప్రచార ఖర్చులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అభ్యర్థులు, రాజకీయ పక్షాలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాను గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలుగా విభజించారు. దీంతో ఈ మూడు జిల్లాల పరిధిలో మూడు లోక్‌సభ, 20 అసెంబ్లీ నియోజక వర్గాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గాల వారీగా చరిత్రను పాఠకులకు అందించే ప్రయత్నమిది...

- అభ్యర్థుల గెలుపోటముల్లో కులమే కీలకం
- ఇక్కడి నుంచి లోక్‌సభలోకి అడుగుపెట్టి ప్రముఖపాత్ర
- దేశంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా పేరు
- నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లే అధికం



పల్నాడు.. పౌరుషాలగడ్డ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)



నియోజక వర్గంలో ప్రధాన సామాజిక వర్గాల ఓట్లు	
కమ్మ	2,14,063
రెడ్డి	1,48,627
ముస్లిం	1,90,589
కాపు	1,60,881
మాదిగ	1,98,613
మాల	1,13,270
ఆర్యవైశ్య	76,544
యాదవ	1,16,986
వడ్డెర	86,903
సుగాలీ	49,945
రజక	42,884
ముదిరాజు	31,796
ఎరుకల	26,981
నాయిబ్రహ్మణ	12,053
యానాది	10,983
బ్రాహ్మణ	9,425

నియోజకవర్గ విశిష్టత

నాగార్జున సాగర్ జలాశయం నిర్మాణంతో ఈ నియోజకవర్గ ప్రజల జీవన విధానంలో మార్పు వచ్చింది. సాగర్ కాల్వలపై విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు సాగర్ జలాలు సరఫరా అవుతున్నాయి. ఇక్కడ పండించే బీపీటీ వరికి మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలలో కూడా మంచి గిరాకీ ఉంది. పత్తి, మిరప పంటలు సుమారు ఐదు లక్షల ఎకరాల్లో సాగవుతాయి. చిలకలూరిపేట నియోజక వర్గం పత్తి పరిశ్రమల ఖిల్లాగా ఉంది. గురజాల నియోజక వర్గంలోని పిడుగురాళ్ల ప్రాంతంలో సున్నపు రాయి పరిశ్రమలు ఉన్నాయి. పల్నాడు చరిత్రకు ఈ నియోజకవర్గం దర్పణం పడుతుంది. నాగార్జున సాగర్, అమరావతి, కోటప్పకొండ, చేజర్ల, గుత్తికొండ బిళంలు పర్యాటక కేంద్రాలుగా ఉన్నాయి. మాచర్లలోని చెన్న కేశవస్వామి ఆలయం పల్నాటి చరిత్రకు అలవాలంగా ఉంది. బ్రహ్మనాయుడి కాలంలో చాపకూటి సిద్ధాంతాన్ని అమలు చేశారు. బ్రిటీష్ హయాంలో కన్నెగంటి హనుమంతు పన్నుల నిరాకరణ ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారు. కోహినూరు వజ్రానికి ఈ నియోజకవర్గం పుట్టినిల్లు. ఫ్యాక్షనిజంతో పాటు నక్సల్స్ ప్రభావిత నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. నక్సల్స్ నేత చారుమజుందార్ గుత్తికొండ బిళం నుంచి నక్సలిజాన్ని విస్తరింపచేశారు. నక్సలైట్లపై నిషేధం ఎత్తివేసి ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించిన సందర్భంగా మావోయిస్టు నేతలు గుత్తికొండ బిళం వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. నాగార్జున సాగర్ జలాశయం, మధ్యలో ఉన్న కొండ, అమరావతిల్లో బౌద్ధ కేంద్రాలు ఉన్నాయి. ఈ రెండు చోట్ల పురావస్తు శాఖ మ్యూజియంలను నిర్వహిస్తున్నది. అమరావతిలో ప్రపంచస్థాయి కాలచక్ర మహాసభలను బౌద్ధులు నిర్వహించారు. సాహితీ, కళ, రాజకీయ రంగాలలో అనేక మంది ప్రముఖులు ఈ నియోజకవర్గం నుంచి ఎదిగారు.

పల్నాడు.. పౌరుషాల గడ్డ. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక. కక్షలు, కార్పణ్యాలు మిళితమై అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తాయి. నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎన్నికలు, రాజకీయాలు.. బాంబుల సంస్కృతితో ముడిపడి ఉంటాయి. ప్రధానంగా కండ, ధన బలంతో ముందుండే వారిదే పైచేయిగా ఉంటుంది. అన్నింటి కంటే కులం కీలక పాత్ర పోషిస్తుంది. ఎన్నికల్లో రిగ్గింగ్‌లు, సైక్లింగ్‌లకు పెట్టింది పేరు. దేశంలోనే అత్యంత సమస్యాత్మక నియోజకవర్గంగా ఎన్నికల కమిషన్ జాబితాలో నరసరావుపేట ఉంది. మాజీ ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ఇక్కడి నుంచి రెండు సార్లు విజయం సాధించి లోక్‌సభలోకి అడుగుపెట్టి జాతీయ రాజకీయాల్లో ప్రముఖపాత్ర పోషించారు. దీంతో నియోజకవర్గానికి దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు కాసు బ్రహ్మానందరెడ్డి, నేదురుమల్లి జనార్ధన రెడ్డి, కొణిజేటి రోశయ్య లోక్‌సభ సభ్యులుగా నరసరావుపేట నుంచి ఎన్నికయ్యారు. ఈ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళల ఓట్లు అధికంగా ఉన్నాయి. మహిళల తీర్పుపై అభ్యర్థుల జాతకాలు ఆధారపడి ఉంటాయి.

పునర్విభజనలతో పలు మార్పులు

1951లో నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటికి మూడు సార్లు నియోజకవర్గ పునర్విభజన జరిగింది. 1957, 1962లలో జరిగిన ఎన్నికల్లో దీనిని మార్కాపురం నియోజక వర్గంగా మార్పు చేశారు. అనంతరం 1967 ఎన్నికల్లో తిరిగి నరసరావుపేట నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. 2009కి ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ఈ నియోజక వర్గ రూపురేఖలు మారిపోయాయి. అంతకు ముందు నియోజక వర్గం గుంటూరు, ప్రకాశం జిల్లాలకు విస్తరించి ఉండేది. నరసరావుపేట, గురజాల, మాచర్ల, వినుకొండ, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కంభం, దర్శి అసెంబ్లీ నియోజక వర్గాలు నరసరావుపేట లోక్‌సభ పరిధిలో ఉండేవి. 2009లో జరిగిన పునర్విభజనతో లోక్‌సభ స్థానం పల్నాడు జిల్లాకే పరిమితమైంది. నరసరావుపేట లోక్‌సభ పరిధిలో నరసరావుపేట, వినుకొండ, గురజాల, మాచర్ల, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పెద కూరపాడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. పునర్విభజనతో పార్టీల బలాబలాల్లో కూడా పూర్తిగా మార్పు వచ్చింది. ప్రకాశం జిల్లాలోని మూడు నియోజకవర్గాలు ఈ నియోజకవర్గం కింద ఉన్నప్పుడు కాంగ్రెస్‌దే పైచేయిగా ఉండేది. నియోజకవర్గ పునర్విభజనతో అప్పటి గుంటూరు జిల్లాకు నరసరావుపేట లోక్‌సభ స్థానం పరిమితం కావడంతో తదుపరి జరిగిన ఎన్నికల్లో రెండు సార్లు ఇక్కడి నుంచి టీడీపీ అభ్యర్థులు వరుసగా గెలుపొందారు. మొత్తం మీద ఈ నియోజకవర్గం టీడీపీకి అనుకూలంగా మారిందని రాజకీయ విశ్లేషకులు చెపుతుంటారు. టీడీపీ ఆవిర్భావ అనంతరం జరిగిన 1984, 1996 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు ఇక్కడి నుంచి విజయం సాధించారు. 1989, 1991, 1998, 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ నియోజక వర్గం నుంచి ఇండిపెండెంట్, సీపీఐ అభ్యర్థులు కూడా గెలుపొందిన చరిత్ర ఉంది. 1951లో జరిగిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా చాపలమడుగు రామయ్యచౌదరి విజయం సాధించారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ఓటమి చెందిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ ఓట్లు
1951	చాపలమడుగు రామయ్య చౌదరి	స్వతంత్ర	నంద్యాల ఆంజనేయులు రెడ్డి	కాంగ్రెస్	29,936
1957	చేగిరెడ్డి బాలిరెడ్డి	కాంగ్రెస్	గుజ్జుల యలమందారెడ్డి	సీపీఐ	18,805
1962	గుజ్జుల యలమందారెడ్డి	సీపీఐ	చేగిరెడ్డి బాలిరెడ్డి	కాంగ్రెస్	28,827
1967	మద్ది సుదర్శనం	కాంగ్రెస్	టీకే చౌదరి	ఎస్‌డబ్ల్యుపి	64,431
1971	మద్ది సుదర్శనం	కాంగ్రెస్	వైవీ నరసింహారావు	స్వతంత్ర	1,30,851
1977	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	ఐ కోటిరెడ్డి	బీఎల్‌డీ	88,071
1980	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్‌ఐ	పోపూరి బ్రహ్మానందం	స్వతంత్ర	84,296
1984	కాటూరి నారాయణ స్వామి	టీడీపీ	కాసు బ్రహ్మానందరెడ్డి	కాంగ్రెస్	14,238
1989	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	పిడతల రంగారెడ్డి	టీడీపీ	65,706
1991	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	అనిశెట్టి పద్మావతి	టీడీపీ	62,616
1996	కోట సైదయ్య	టీడీపీ	కాసు వెంకట కృష్ణారెడ్డి	కాంగ్రెస్	18,958
1998	కొణిజేటి రోశయ్య	కాంగ్రెస్	కోట సైదయ్య	టీడీపీ	47,819
1999	నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి	కాంగ్రెస్	ఎస్‌ఎం లాల్ జాన్ బాషా	టీడీపీ	13,852
2004	మేకపాటి రాజమోహనరెడ్డి	కాంగ్రెస్	మద్ది లక్ష్మయ్య	టీడీపీ	86,255
2009	మోదుగుల వేణుగోపాలరెడ్డి	టీడీపీ	వల్లభనేని బాలశౌరి	కాంగ్రెస్	1607
2014	రాయపాటి సాంబశివరావు	టీడీపీ	ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి	వైసీపీ	35,280
2019	లావు శ్రీకృష్ణదేవరాయలు	వైసీపీ	రాయపాటి సాంబశివరావు	టీడీపీ	1,53,978



బరిలో లావు, అనిల్

తాజా ఎన్నికల బరిలో సిట్టింగ్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా ఖరారు చేసింది. వైసీపీ నుంచి నెల్లూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనిల్‌కుమార్ పోటీలో ఉన్నారు. వీరిద్దరూ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి పనుల అజెండాగా లావు ప్రచారం నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని అనిల్‌కుమార్ చెబుతున్నారు.

దూరదృష్టి ఉన్న నేత చంద్రబాబు

- ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టం
- బాపట్ల టీడీపీ లోక్‌సభ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్

బాపట్ల, మార్చి 23: విజన్, దూరదృష్టి ఉన్న నేత నారా చంద్రబాబునాయుడని బాపట్ల టీడీపీ లోక్‌సభ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ తెలిపారు. ఆయనతో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. బాపట్ల లోక్‌సభకు టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత మొదటిసారిగా శనివారం కృష్ణప్రసాద్ బాపట్లకు వచ్చారు. ఈ సందర్భంగా బాపట్ల టీడీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 నుంచి 2004 వరకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రపంచదేశాల మన్ననలను పొందారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి విజయం సాధించాలని ప్రపంచ దేశాలు ఆకాంక్షిస్తున్నాయన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో ఉమ్మడి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్‌తో అద్భుతమైన ప్రగతి సాధించగలమన్నారు. దీనిని ఎవరు ఆపలేరన్నారు. యువతకు, మహిళలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పిస్తామన్నారు. బాపట్ల లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీచేస్తున్న అభ్యర్థులు అద్భుతమైన టీమ్ అని వారందరూ విజయం సాధించటం తథ్యమన్నారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజని, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ముక్కామల సాంబశివరావు, నాయకులు మందపాటి ఆంద్రేయ, విన్నకోట వీరయ్యనాయుడు, కావరి శ్రీనివాసరెడ్డి, పల్లం జీవన్, టీడీపీ నాయకులు కూరపాటి పూర్ణశంకరరావు, చెన్నుపాటి హైమావతి, జంగం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో వేగేశనతో కలిసి మాట్లాడుతున్న లోక్‌సభ టీడీపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్

జెండా తొలగించలేదని ఫిర్యాదు

టీడీపీ కార్యకర్తపై వైసీపీ ఎంపీటీసీ దాడి

కొల్లూరు, మార్చి 23: ఎన్నికల కోడ్ నేపథ్యంలో పంచాయతీ సిబ్బంది టీడీపీ వర్గీయుల ఇళ్లపైన ఉన్న జెండాలను తొలగించారు. అయితే వైసీపీ వారి ఇళ్లపై జెండాలు తొలగించలేదు. దీనిని గుర్తించిన టీడీపీ కార్యకర్త అధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సహించలేని వైసీపీ ఎంపీటీసీ టీడీపీ కార్యకర్తపై దాడి చేశారు. ఈ సంఘటన శనివారం సాయంత్రం కొల్లూరు మండలం కిష్కింధపాలెం గ్రామంలో జరిగింది. ఇందుకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా టీడీపీ నాయకుల ఇళ్లపై కట్టిన జెండాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. వైసీపీ ఎంపీటీసీ ఇంటిపై పార్టీ జెండాను తొలగించలేదు. తమ ఇళ్లపై జెండాలను తొలగించి, ఎంపీటీసీ ఇంటిపై ఉన్న జెండాను ఎందుకు తొలగించలేదని టీడీపీ కార్యకర్త కొల్లి వెంకటేశ్వరరావు సంబంధిత సిబ్బందిని ప్రశ్నించాడు. ఈ విషయాన్ని వీఆర్వో, పంచాయతీ సిబ్బంది వైసీపీ ఎంపీటీసీకి తెలిపి జెండాను తొలగించాలని సూచించారు. దీంతో తనపై ఫిర్యాదు చేస్తావా అంటూ ఎంపీటీసీ పొలిమెట్ల ఆనందకిషోర్, సర్పంచ్ నీలాంబరం, కార్యకర్తలు గురివిందపల్లి లోకం, కొక్కిలిగడ్డ లాజరు తదితరులు టీడీపీ కార్యకర్త వెంకటేశ్వరరావు ఇంటిపైకి వెళ్లారు. వెంకటేశ్వరరావుపై ఎంపీటీసీ విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. ఈ దాడిపై బాధితుడు కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. టీడీపీ కార్యకర్త దాడి చేసి తనను కులం పేరుతో దూషించాడని ఎంపీటీసీ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రారెడ్డి తెలిపారు. ఇద్దరి ఫిర్యాదులు స్వీకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.


గాయపడిన టీడీపీ కార్యకర్త వెంకటేశ్వరరావు

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

టీడీపీ కార్యకర్త వెంకటేశ్వరరావుపై దాడి చేసిన వైసీపీ వర్గీయులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు షైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. జెండా తొలగింపుపై ఫిర్యాదు చేసినందుకు ఇంటిపైకి వెళ్లి దాడి చేయడం అమానుషమన్నారు. ఈ సంఘటనపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశామన్నారు. దాడిలో పాల్గొన్న వారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(ఆదివారం)

సహారీ (ఉదయం) 4.52 (సోమవారం)

వార్డెన్లు అప్పులపాలు



- డైట్‌చార్జీల బిల్లులు రాక ఆందోళన
- ఒక్కో హాస్టల్‌కు రూ.5 లక్షలకుపైగా పెండింగ్
- విద్యా సంవత్సరం ముగుస్తున్నా విడుదల కాని డైట్ చార్జీలు
- నిధులు ఉన్నా ట్రెజరీలో బిల్లులకు మోక్షం లేదు
- అప్పులతో వసతి గృహాల నిర్వహణ చేయలేమంటోన్న సంక్షేమాధికారులు



గుంటూరు(విద్య), మార్చి 23: డైట్ బిల్లులు రాక.. పంపిణీదారులు సరుకులు ఇవ్వక.. పిల్లల ఆకలి కేకలు చూడలేక వార్డెన్లు అప్పులు చేసి ఆహార పదార్థాలు కొనుగోలు చేసి ఇంతకాలం హాస్టళ్లను నడిపారు. అయితే నెలలు గడుస్తున్నా డైట్ బిల్లులు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. మరో నెల రోజుల్లో విద్యా సంవత్సరం ముగియనున్నది. దీంతో రూ.లక్షలు అప్పులు చేసిన వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. కొన్ని చోట్ల అప్పులతో నిత్యావసర వస్తువులు కొనలేమని కొంతమంది చేతులు ఎత్తివేస్తున్నారు. ఇప్పటి వరకు అప్పులు చేసి తెచ్చిన నిత్యావసర సరుకులు, కూరగాయలు, గుడ్లు, చికెన్ బిల్లులకు సంబంధించి ఒక్కో హాస్టల్‌కు రూ.లక్షల్లో రావాల్సి ఉంది. దీంతో పంపిణీదారులు అప్పు ఇవ్వడానికి ముందుకు రావడం లేదని వార్డెన్లు వాపోతున్నారు. ప్రభుత్వం సత్వరం నిధులు విడుదల చేయకుంటే హాస్టళ్లను నిర్వహించడం తమవల్ల కాదంటూ కొందరు వార్డెన్లు జిల్లా స్థాయి అధికారులకు స్పష్టం చేశారు. ఫలితంగా విద్యార్థులు ఆకలి కేకలతో అలమటించాల్సిన పరిస్థితి నెలకొంది. ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 42, బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 54, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 9 హాస్టళ్లు ఉన్నాయి. ఆయా హాస్టళ్లలో దాదాపు 15 వేల మందికిపైగా విద్యార్థులు 3 నుంచి 10వ తరగతి వరకు వసతి పొందుతూ చదువుకుంటున్నారు. వారికి ప్రభుత్వం డైట్‌చార్జీల కింద నెలకు 3,4 తరగతుల విద్యార్థులకు రూ.1000, 5 నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1250, కళాశాల స్థాయి విద్యార్థులకు రూ.1400 చెల్లించాలి. ఈ నిధులతోనే విద్యార్థుల వంటకు అవసరమైన కూరగాయలు, చికెన్, గుడ్లు, పండ్లు తదితరాలు కొనుగోలు చేస్తారు. అయితే ప్రభుత్వం 8 నెలల నుంచి డైట్ చార్జీలు చెల్లించడం లేదని వార్డెనులు తెలిపారు. ఒక్కోహాస్టల్‌కు రూ.1.20 లక్షల నుంచి రూ.5 లక్షలకుపైగా డైట్‌చార్జీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అంటే ఉమ్మడి జిల్లాలో అన్ని వసతిగృహాలు కలిపి 105 ఉన్నాయి. అంటే రూ.1.26 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉందని సమాచారం. బయోమెట్రిక్ ప్రకారం విద్యార్థుల హాజరు నమోదు చేసి ట్రెజరీకి నెలవారీగా డైట్ బిల్లులను వార్డెను పంపుతారు. డైట్ చార్జీలకు అవసరమైన బడ్జెట్ ఉందని, జిల్లా స్థాయిలో బిల్లులు ట్రెజరీకి పంపినా అనుమతులు మాత్రం ఇంతవరకు రాలేదని అధికారులు చెబుతున్నారు. అప్పులు తేవడంతోపాటు తమ జీతం డబ్బులను కూడా సరుకుల కొనుగోళ్ల కోసం ఖర్చు చేసిన వార్డెన్లు మరో నెలలో విద్యా సంవత్సరం ముగియనుండటం.. ప్రస్తుత ప్రభుత్వం గడువు ముగియనుండటంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రచారం తప్ప.. పైసలు ఇవ్వరు...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఏ సభలో మాట్లాడినా నా ఎస్సీ, ఎస్టీ, నా బీసీ అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పడం తప్ప పేద, బడుగు, బలహీన వర్గాల గోడు పట్టించుకున్న దాఖలాలు లేవనేందుకు వసతిగృహాల అంశమే నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు. మరోవైపు విద్యార్థిని విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్స్ చార్జీలు కూడా ఇప్పటి వరకు విడుదల చేయలేదు.

దిక్సూచి DIKSUCHI

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీ ఈసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) నిర్వహిస్తోంది. ఈ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంటెక్/ఎంఫార్మసీ/ఫార్మాడీ (పీబీ)ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇంజనీరింగ్/ఫార్మసీ కాలేజీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. సీట్ల భర్తీలో గేట్/జీప్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. తరవాతనే ఏపీపీజీఈసెట్ 2024 స్కోర్ సాధించిన అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ పీజీ ఈసెట్

విభాగాలు: కెమికల్, అగ్రికల్చరల్, ఏరోనాటికల్, అప్లయిడ్ పెట్రోలియం, ఆర్కిటెక్చరల్, ఏరోస్పేస్, ఆటొమొబైల్, బయో కెమికల్, బయోఇన్ఫర్మాటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్, సివిల్ కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, సివిల్ ఎన్విరాన్‌మెంటల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్, డెయిరీ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీమాటిక్స్, ఫుడ్ సైన్స్/ఇంజనీరింగ్/టెక్నాలజీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియోసైన్స్, ఇండస్ట్రియల్ బయోటెక్నాలజీ, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండస్ట్రియల్ ప్రొడక్షన్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇంజనీరింగ్, మెకట్రానిక్స్, మెకానికల్, మెటలర్జీ, మైనింగ్, మెకానికల్ మెరైన్, నేవల్ ఆర్కిటెక్చర్, పెట్రోలియం ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ, ఫార్మసీ, వెటర్నరి సైన్స్, డెంటల్, అప్లయిడ్ కెమిస్ట్రీ, అప్లయిడ్ ఫిజిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, టెలి కమ్యూనికేషన్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పవర్ ఇంజనీరింగ్, మైక్రో బయాలజీ, లైఫ్ సైన్సెస్ తదితరాలు.

ఏపీ పీజీ ఈసెట్ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. విభాగానికి నిర్దేశించిన ప్రకారం సంబంధిత స్పెషలైజేషన్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.



ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు.

అర్హతలు: ఏఐసీటీఈ/యూజీసీ గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంజనీరింగ్/ఫార్మసీ డిగ్రీ పూర్తి చేసి ఉండాలి.

- ఎంటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/బీఆర్క్/ఏఎంఐఈ+డిప్లొమా/ఎమ్మెస్సీ/ఎంసీఏ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఎంఫార్మసీ/ఫార్మాడీ(పీబీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి బీఫార్మసీ/బీడీఎస్/ఎమ్మెస్సీ/ఎంబీబీఎస్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఏపీ పీజీ ఈసెట్ తేదీలు:** మే 29 నుంచి 31
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xGJZGARలో చదవండి.

కాకినాడ ఐఐఎఫ్‌టీలో బీబీఏ-ఎంబీఏ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - కాకినాడ క్యాంపస్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్(ఐపీఎం)ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీబీఏ(బిజినెస్ అనలిటిక్స్), ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్) కోర్సులు ఉంటాయి. ఇండోర్ ఐఐఎం నిర్వహించే ఐపీమ్యాట్ 2024 స్కోర్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మొత్తం 60 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఆర్ట్స్/కామర్స్/సైన్స్ గ్రూప్‌లతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్/ బిజినెస్ మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. 2022, 2023 సంవత్సరాల్లో ఇంటర్/తత్సమాన కోర్సు పూర్తిచేసినవారు, 2024లో చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు 2004 ఆగస్టు 1న/ఆ తరవాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్ల మినహాయింపు వర్తిస్తుంది.

ముఖ్య సమాచారం

ఐఐఎం ఇండోర్-ఐపీమ్యాట్ 2024

- **ఐపీమ్యాట్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **ఐపీమ్యాట్ 2024 తేదీ:** మే 23
- **వెబ్‌సైట్:** www.iimidr.ac.in

ఐఐఎఫ్‌టీ-ఐపీఎం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 23
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్'

ప్రముఖ ఎంఎన్‌సీ 'గూగుల్- మహిళలకు 'జనరేషన్ గూగుల్ స్కాలర్‌షిప్' పేరిట ఆర్థిక సహకారాన్ని అందిస్తోంది. కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే మహిళలు అర్హులు. భారత విద్యార్థినులు 'ఆసియా పసిఫిక్' కేటగిరీ కింద దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 1250 దరఖాస్తులను అనుమతిస్తారు. ఎంపికైనవారికి 2500 యూఎస్ డాలర్ల స్కాలర్‌షిప్ లభిస్తుంది.

అర్హత: ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఏదేని ఆసియా పసిఫిక్ దేశంలో గుర్తింపు పొందిన యూనివర్సిటీలో బ్యాచిలర్స్ డిగ్రీ ప్రవేశం పొందాలనుకునేవారు అప్లయ్ చేసుకోవచ్చు. కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/తత్సమాన సాంకేతిక విభాగాలకు సంబంధించిన డిగ్రీ కోర్సులు ఎంచుకోవాలి. స్కూల్ స్థాయి నుంచి మంచి అకడమిక్ రికార్డ్ తప్పనిసరి. నాయకత్వ లక్షణాలు ఉండాలి. కంప్యూటర్లపై ప్రాథమిక అవగాహన కూడా లేని వారికి అవసరమైన పరిజ్ఞానాన్ని అందించడంలో ఆసక్తి ఉండాలి. టెక్నికల్ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన నైపుణ్యాలు ఉండాలి. దరఖాస్తుతోపాటు ఇచ్చిన రెండు షార్ట్ ఆన్సర్ ఎస్సే క్వశ్చన్స్‌కు కనీసం 500 పదాలకు తగ్గకుండా సమాధానాలు రాసి అప్‌లోడ్ చేయాలి. 2023-2024 విద్యా సంవత్సరంలో డిగ్రీ రెండో ఏడాది/మూడో ఏడాది కోర్సు రిజిస్టర్ చేసుకున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ ప్రతిభ, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యం తదితరాల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 23
- **వెబ్‌సైట్:** https://buildyourfuture.withgoogle.com/



మలేషియాలో నవతిహి ఉత్సవం

తెలుగు చిత్ర పరిశ్రమ 90 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలేషియాలో 'నవతిహి ఉత్సవం' నిర్వహించనున్నారు. దీని వివరాలు వెల్లడించడం కోసం శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో 'మా' అధ్యక్షుడు విష్ణు మంచు మాట్లాడుతూ 'తెలుగు సినిమా 90 ఏళ్ల ఉత్సవాన్ని నిర్వహించాలని రెండేళ్ల క్రితమే నిర్ణయించుకున్నాం. తెలుగు సినిమా ప్రారంభమైన రోజుల నుంచి ఎంతోమంది నటీనటులను గుర్తు చేసుకుంటూ ఈ వేడుకని చాలా గ్రాండ్‌గా నిర్వహించాలని అనుకున్నాం. అనివార్య కారణాల వల్ల అది వాయిదా పడుతూ వస్తోంది. ఈ ప్రోగ్రామ్ నుంచి 'మా' కోసం ఫండ్ రైజింగ్ కూడా చేయాలనుకున్నాం. తాజాగా మలేషియా ప్రభుత్వం సహకారంతో ఈ వేడుక నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. జులైలో మలేషియాలో భారీగా జరుపుతాం. పరిశ్రమ పెద్దలతో నిర్ణయించి తేదీని ఖరారు చేస్తాం. మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించే ఈ వేడుకల కోసం సినిమా ఇండస్ట్రీకి సెలవు ఇవ్వాలని ఫిల్మ్ ఛాంబర్ పెద్దలను అడిగాం. ఇతర రాష్ట్రాల సినీ ప్రముఖులను కూడా ఇందులో భాగం చేయాలనుకుంటున్నాం' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మలేషియా ప్రభుత్వం నుంచి వచ్చిన కమలనాథన్, మలేషియా టూరిజం డైరెక్టర్ రాజౌది అబ్దుల్ రాహిమ్, రాహుల్ రెడ్డి, ఎడ్విన్ ఆనందరాజ్, 'మా' ఉపాధ్యక్షుడు మాదాల రవి, శివబాలాజీ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తు కోసం...

- నిర్మాత గూడూరు నారాయణరెడ్డి



నేషనల్ అవార్డ్ విన్నర్ బాబీ సింహా ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'రజాకార్'. రాజ్ అర్జున్, మకరంద్ దేశ్ పాండే, ప్రేమ, ఇంద్రజ, అనసూయ భరద్వాజ్, వేదిక కీలక పాత్రల్లో నటించారు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదలైంది. శనివారం చిత్ర యూనిట్ 'హిస్టారికల్ హిట్' పేరిట సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన స్టార్ రైటర్ విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ " నేను తీసిన 'రాజన్న' సినిమాలో రజాకార్ల తాలూకు విషయాన్ని టచ్ చేశాను. ఈ సబ్జెక్ట్‌పై ఎవరైనా పూర్తి స్థాయి సినిమా చేస్తే బావుంటుందని అనుకున్నాను. గూడూరు నారాయణరెడ్డి నా ఆలోచనను నిజం చేశారు. ఈ సినిమాకు పాజిటివ్ టాక్ రావడం ఎంతో ఆనందంగా ఉంది" అని అన్నారు. నిర్మాత గూడూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ "భావితరాల భవిష్యత్తు కోసం తీసిన సినిమా ఇది. డబ్బు కోసం, గ్లామర్ కోసం తీయలేదు" అని చెప్పారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ "ఈ సినిమాకు సంబంధించిన వారందరూ ప్రాణం పెట్టి పని చేశారు. ఈ సినిమాకు నేను పడిన కష్టం కంటే వారు పడిన కష్టమే ఎక్కువ" అని అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ "చాకలి ఐలమ్మగా నా కెరీర్‌లోనే ఉత్తమ పాత్ర పోషించాను" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

25 ఏళ్ల తర్వాత మళ్లీ...



సూపర్ హిట్ కాంబినేషన్లు ఎప్పుడెప్పుడు రిపీట్ అవుతుంటాయా అని ప్రేక్షకులు ఎదురుచూస్తుంటారు. అలాంటి వాటిలో ప్రభుదేవా, ఏ. ఆర్. రెహమాన్ కలయిక ఒకటి. దాదాపు 25 ఏళ్ల తర్వాత మళ్లీ ఈ హిట్ కాంబో ప్రేక్షకులను పలకరించనుంది. ఇది వీరిద్దరి కలయికలో వస్తున్న ఆరో చిత్రం కావడం విశేషం. ఈ చిత్రానికి వర్కింగ్ టైటిల్ 'ఏఆర్ఆర్‌పీడీ6'. ఎన్. ఎస్. మనోజ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. యోగిబాబు, అజు వర్గీస్, అర్జున్ అశోకన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. వైవిధ్యమైన కథాంశంతో, పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. మే నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్



శ్రీవిష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ నటించిన చిత్రం 'ఓం భీం బుష్'. శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించారు. సునీల్ బలుసు నిర్మించారు. ఈ శుక్రవారం విడుదలైన 'ఓం భీం బుష్' హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ నిర్మాత దిల్ రాజ్ మాట్లాడుతూ "దర్శకుడు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందివ్వాలని చేసిన ప్రయత్నానికి సక్సెస్ లభించడం ఆనందంగా ఉంది" అని అన్నారు. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ "సమ్మర్‌లో మంచి ఎంటర్‌టైన్‌మెంట్ కావాలంటే ఈ చిత్రాన్ని చూడండి" అని అన్నారు. శ్రీవిష్ణు మాట్లాడుతూ "ఈ సినిమాకు యూత్‌తో పాటు ఫ్యామిలీస్ నుంచి కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది" అన్నారు. రాహుల్ రామకృష్ణ మాట్లాడుతూ "కష్టే ఫలి అంటారు. మేము పడిన కష్టానికి తగ్గ హిట్ ప్రేక్షకులు ఇచ్చారు" అని చెప్పారు. దర్శకుడు హర్ష కొనుగంటి మాట్లాడుతూ "థియేటర్స్‌లో సినిమా చూసిన వారు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర బృందం పాల్గొంది.

కొత్త ఎక్స్‌పీరియెన్స్

రామ్ మిర్యాల.. ఆయన పాట వింటుంటే మన స్నేహితుడే పాడుతున్నట్లుంటుంది. మన మట్టి వాసనను గుర్తుకు తెచ్చేలా, మన భావోద్వేగాలను స్పృశించేలా పాట పాడటం రామ్ మిర్యాల ప్రత్యేకత. ఓ వైపు సింగర్‌గా, మరో వైపు మ్యూజిక్ డైరెక్టర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం 'ఆయ్' చిత్రానికి సంగీతం అందిస్తున్న రామ్ మిర్యాల మీడియాతో ముచ్చటించారు.



"ఆయ్' సినిమా కోసం నన్ను బన్నీవాస్ పిలిచారు. నా స్టైల్ ఆఫ్ మ్యూజిక్ ఒకలా ఉంటుంది. ఆయనేమో నెటివిటీ బేస్డ్ ఫన్ ఎంటర్‌టైనర్ మూవీ చేస్తామని అన్నారుగా.. నాకేం సెట్ అవుతుందిలే నో చెప్పేద్దామని అనుకున్నాను. కానీ అక్కడకు వెళ్లి కథ విన్నాక.. చాలా బాగా నచ్చేసింది. గోదావరి బ్యాక్ డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఇప్పటి వరకు ఇలాంటి జోనర్‌లో నేను సినిమా చేయలేదు, అందుకే ఒప్పేసుకున్నా. ఈ చిత్రం నాకు సరికొత్త ఎక్స్‌పీరియెన్స్ ఇచ్చింది. ఈ సినిమాలో చక్కటి కామెడీతో పాటు ఎంతో మంచి లవ్ స్టోరీ కూడా ఉంటుంది. ఈ సినిమాలో రెండు పాటలు చేశాను. రీసెంట్‌గా 'సూఫియానా' అనే మెలోడి సాంగ్ రిలీజైంది. ఈ పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో చేసిన మరో పాట పెళ్లి నేపథ్యంలో ఉంటుంది. అది కూడా త్వరలోనే రిలీజ్ అవుతుంది. సాధారణంగా మ్యూజిక్ డైరెక్టర్‌కి, చిత్ర దర్శకుడితో మంచి బంధం ఉండాలి. అప్పుడే మంచి సంగీతం కుదురుతుంది. ఓ సింగర్‌గా, మ్యూజిక్ డైరెక్టర్‌గా అన్ని రకాల పాటలను చేయాలనేది నా కోరిక. నేను రీసెంట్‌గా వర్క్ చేసిన 'టిల్లు స్క్వేర్' మూవీ ఈ నెల 29న రిలీజ్ అవుతోంది.



భరతనాట్యంతో బాగా నవ్విస్తాం

సూర్యతేజ ఏలేను హీరోగా పరిచయం చేస్తూ రూపొందుతున్న 'భరతనాట్యం' చిత్రం థియేట్రికల్ ట్రైలర్‌ను శనివారం విడుదల చేశారు. 'దొరసాని' చిత్ర దర్శకుడు కేవీఆర్ మహేంద్ర రూపొందించిన ఈ చిత్రం ఏప్రిల్ 5న విడుదల కానుంది. పాయల్ సరాఫ్ నిర్మాత. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన కోన వెంకట్ మాట్లాడుతూ 'క్రైమ్ కామెడీ ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఇంతమంచి ఎంటర్‌టైనర్ ద్వారా ధని ఏలే కుమారుడు సూర్యతేజ పరిచయం కావడం ఆనందంగా ఉంది. సినిమా తప్పకుండా విజయం సాధించాలి' అని కోరారు. కంటెంట్ నమ్మి ఈ సినిమా తీయడానికి ముందుకు వచ్చిన నిర్మాతలకు హీరో సూర్యతేజ కృతజ్ఞతలు తెలిపారు. తనకు అవకాశం ఇచ్చిన వారందరికీ ఆయన ధన్యవాదాలు చెప్పారు. దర్శకుడు మహేంద్ర మాట్లాడుతూ 'దొరసానికి భిన్నమైన కథ ఇది. అందుకే సవాల్‌గా తీసుకుని మంచి చిత్రం అందించడానికి ప్రయత్నించా. ఇందులో మంచి డ్రామా ఉంది. పాత్రలన్నీ కొత్తగా ఉంటాయి. ప్రేక్షకులు కోరుకొనే అన్నీ అంశాలు ఉన్నాయి. నలభై నిమిషాల పాటు కడుపుబ్బ నవ్వించే సీన్లు ఉన్నాయి' అని తెలిపారు. కామెడీ, థ్రిల్, డాన్స్, ఫ్యామిలీ, లవ్, డ్రామా.. ఇలా అన్ని అంశాలు చిత్రంలో ఉన్నాయని హీరోయిన్ మీనాక్షి గోస్వామి తెలిపారు



బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మందడం రైతులు

వైసీపీ అరాచక పాలన మాకొద్దు

● 1558వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, మార్చి 23: వైసీపీ దౌర్జన్య అరాచక పాలన మాకొద్దు.. అభివృద్ధి చేసే విజన్ ఉన్న నాయకుడు కావాలని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు శనివారం నాటికి 1558వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ విభజన రాష్ట్రానికి అభివృద్ధి అవసరమన్నారు. సీఎం జగన్‌రెడ్డి దాని గురించి పట్టించుకోలేదన్నారు. దీంతో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనక్కిపోయిందన్నారు. అమరావతిని నాశనం చేయాలనుకున్న పాలకులకు జరగబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మూడు రాజధానులు ఎవరూ కోరుకోలేదన్నారు. ప్రజల నిర్ణయం అమరావతి రాజధానేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

టీడీపీతోనే ప్రజలకు సంక్షేమం

● పెన్షన్లు, సంక్షేమంపై పేటీఎం బ్యాచ్‌తో తప్పుడు ప్రచారం
● ప్రజా ప్రభుత్వం వచ్చాక ఇంకా మెరుగైన సంక్షేమం అందిస్తాం
● ఎన్నికల ప్రచారంలో యువనేత నారా లోకేశ్


మెల్లెంపూడి రచ్చబండలో మాట్లాడుతున్న లోకేశ్


తాడేపల్లిలో అవ్వతో ఆప్యాయంగా యువనేత లోకేశ్..


ప్రాతూరులో మతపెద్దల ఆశీర్వాదం తీసుకుంటున్న లోకేశ్

తాడేపల్లి టౌన్/ తాడేపల్లి, మార్చి 23: రాబోయే ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి వైసీపీ కుట్రలను తిప్పికొట్టాలి.. మాయమాటలకు మోసపోవద్దని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తాడేపల్లి ఎన్టీఆర్ కట్ట, ప్రాతూరు చర్చి సెంటర్, మెల్లెంపూడి మసీదు వద్ద నిర్వహించిన రచ్చబండ సభల్లో యువనేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వస్తే పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని వైసీపీ పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు, రాబోయే ప్రజా ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా పెన్షన్‌తో పాటు ఇతర సంక్షేమ పథకాలను అందజేస్తామని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెన్షన్ మొదట ప్రవేశపెట్టింది అన్న ఎన్టీఆర్ అని తెలిపారు. 2014కు ముందు రూ.200 ఉన్న పెన్షన్‌ను చంద్రబాబునాయుడు రూ.2వేలు చేశారని గుర్తు చేశారు. అన్న క్యాంటీన్లు, పసుపు కుంకుమ, పెళ్లికానుకలు, చంద్రన్న బీమా వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు గత ఎన్నికల్లో ఓడిపోయినా మంగళగిరిలో 29 అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానని అన్నారు. తాడేపల్లి ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. వాటర్ ట్యాంకర్ అందుబాటులో ఉంచడం, తోపుడు బండ్లు, కుట్టు మిషన్లు అందిస్తూ ప్రజలకు అండగా నిలబడ్డానమన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికంటే మరింత మెరుగైన సంక్షేమాన్ని ప్రజలకు అందిస్తామన్నారు.

తప్పించుకు తిరుగుతున్న ఆళ్ల..

ఆళ్ల రామకృష్ణారెడ్డి 2019 ఎన్నికల సమయంలో కనిపించారన్నారు. ఎక్కడ ఇళ్ల పట్టాలు అడుగుతారోనని తప్పించుకుని తిరిగి మళ్లీ ఇప్పుడే కనిపిస్తున్నారని లోకేశ్ ఎద్దేవా చేశారు. ఆర్కేను రెండు సార్లు గెలిపించారు. ఇప్పుడు కొత్తగా ఒక చెల్లెమ్మను తీసుకుని వచ్చారని అన్నారు. 2019 ఎన్నికల సమయంలో లోకేశ్ గెలిస్తే ఇళ్లు తీసేస్తారని ఆనాడు ఆళ్ల దుష్ప్రచారం చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ నివాసం వద్ద ఇళ్లు ఎవరు తొలగించారు అని ప్రశ్నించారు. ఎన్టీఆర్ కట్ట ప్రాంతంలో దశాబ్దాలుగా జగన్ కనీసం తన ఇంటి ముందు ఉన్న బ్రిడ్జి కూడా కట్టలేకపోయారని ఆరోపించారు. తాను మంత్రిగా పని చేసినప్పుడు మంగళగిరి అభివృద్ధి కోసం ఆళ్ల ఒక్క పని కూడా అడగలేదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న తాను మంగళగిరికి ఐటీ పరిశ్రమ తీసుకురాగా, తద్వారా 150మందికి ఉద్యోగాలు వచ్చాయని లోకేశ్ తెలిపారు.

అమరావతి అభివృద్ధితో ఉద్యోగాల కల్పన

అమరావతి కొనసాగి ఉంటే నిరుద్యోగం ఉండేది కాదని లోకేశ్ తెలిపారు. ఆనాడు కట్టుబట్టలతో వచ్చి అందరికి అందుబాటులో ఉండేవిధంగా అమరావతిని రాజధానిగా చేసుకున్నామన్నారు. చిన్న రాష్ట్రం, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం ఇష్టం లేదంటూ అమరావతికి జగన్ అసెంబ్లీ సాక్షిగా మద్దతు పలికారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత అమరావతిని సర్వనాశనం చేయడమే కాక అమరావతి రైతులు, మహిళలను బూటుకాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రెండు నెలల్లో పట్టాలు అందజేస్తాం..

టీడీపీ ప్రభుత్వం వచ్చిన రెండు నెలల్లో వాగు, కొండ, పోరంబోకు, దేవదాయ, రైల్వే, అటవీభూముల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు పట్టాలిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటితోపాటు, భూగర్భ డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. మంగళగిరిలో నిరుపేదలకు 20 వేల ఇళ్లు కట్టిస్తామన్నారు. ఎన్టీఆర్ కట్టవాసులు తమ సమస్యలను లోకేశ్ దృష్టికి తెస్తూ ఇంటిపట్టాలు ఇవ్వడంతోపాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వికలాంగుల పెన్షన్ పెంచాలని ఇంటిపన్ను, కరెంటు చార్జీలు తగ్గించాలని కోరారు.

ఎంటీఎంసీ కార్పొరేషన్‌పై సానుకూల నిర్ణయం

ఎంటీఎంసీ కార్పొరేషన్ అంశం కోర్టు పరిధిలో ఉంది. పన్నుల భారంతో పేదలు, మధ్యతరగతి వారు సతమతమవుతున్నారు. దీనిపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ వ్యాఖ్యానించారు. ప్రాతూరు వాసులు పలు సమస్యలు లోకేశ్ దృష్టికి తెస్తూ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరారు. శ్మశాన వాటికను అభివృద్ధి చేయడంతోపాటు ప్రహరీ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ వల్ల పెరిగిన పన్నుల భారం తగ్గించాలన్నారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు

తాడికొండ, మార్చి 23: రాష్ట్రంలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తాడికొండ ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ పి.జోగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులను మార్చి 1వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏపీ మోడల్ పాఠశాలలో..

రొంపిచర్ల: మండలంలోని రెడ్డిపాలెంలో గల ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపల్ రవినాయక్ శనివారం తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీపీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఆంగ్లలో చదువుకొనే విద్యార్థులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. వివరాలకు పాఠశాల పని దినాల్లో సంప్రదించాలన్నారు.

నారా లోకేశ్ కాన్వాయ్ తనిఖీ


తాడేపల్లిలో లోకేశ్ కాన్వాయ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

తాడేపల్లి టౌన్, మార్చి 23: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, యువనేత నారా లోకేశ్ కాన్వాయ్‌ను శనివారం పోలీసులు తనిఖీ చేశారు. ఉండవల్లిలోని తన నివాసం నుండి బయలుదేరిన లోకేశ్ కాన్వాయ్‌ను కేఎల్‌రావు కాలనీ సమీపంలో స్క్రూబ్రిడ్జి వద్ద పోలీసులు ఆపారు. కోడ్ నేపథ్యం లో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. లోకేశ్ వారి కి సహకరించి కాన్వాయ్‌లోని అన్ని వాహనాలు తనిఖీ చేసుకునేదాక నిరీక్షించారు. కాగా కాన్వాయ్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏమీ లేవని ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించలేదని పోలీసులు నిర్ధారించారు.

కోర్టుల్లో శిక్షల శాతం పెరిగేలా కృషి చేయండి

● జిల్లా ఎస్పీ తుషార్ డూడీ


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ, పక్కన డీడీ మధుసూదనరావు తదితరులు

గుంటూరు, మార్చి23: జిల్లాలోని కోర్టుల్లో శిక్షల శాతం పెరిగేలా పబ్లిక్‌ప్రాసిక్యూటర్ (పీపీ)లు కృషి చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పీపీలు, ఏపీపీల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లాలో పోలీసు శాఖ అధికారులు, పీపీలు, ఏపీపీలు, ప్రాసిక్యూషన్ సమన్వయం పాటిస్తూ నేరస్తులకు కచ్చితంగా శిక్షపడే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్పీని ఘనంగా శాలువాలతో సన్మానించారు. బాధితులకు న్యాయం చేయడానికి పోలీస్ అధికారుల న్యాయపరమైన సందేహాలను నివృత్తి చేయడానికి ఎప్పుడు సంసిద్ధంగా ఉంటామని సమావేశానికి హాజరైన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పాతూరి మధుసూదనరావ తెలిపారు. కార్యక్రమంలో జిలా క్రైమ్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావ, ఏపీ బార్ కౌన్సిల్ మెంబర్ బ్రహ్మారెడ్డి, పీపీలు, ఏపీపీలు, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకట రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వందేభారత్‌కి పెరుగుతున్న హాల్టులు

● ప్రారంభంలో ఒక్క నల్గొండలో మాత్రమే నిలుపుదల
● నేటి నుంచి మిర్యాలగూడలో కూడా హాల్టింగ్



గుంటూరు, మార్చి 23(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-తిరుపతి-సికింద్రాబాద్ వయా గుంటూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు పెరుగుతున్నాయి. ఇప్పటివరకు సికింద్రాబాద్ - గుంటూరు మధ్యన కేవలం నల్గొండ మాత్రమే నిలుపుదల సౌకర్యం ఉండగా కేంద్ర రైల్వేశాఖ గుట్టుచప్పుడు కాకుండా ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందు మిర్యాలగూడలో స్టాపేజ్ సౌకర్యం కల్పించింది. పైగా నల్గొండ - మిర్యాలగూడ మధ్యన కేవలం 38 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. అదనపు స్టాపేజ్ వలన కచ్చితంగా ఏడు, ఎనిమిది నిమిషాల సమయం నష్టం జరుగుతుంది. అయినప్పటికీ రైలు గమ్యస్థానం చేరుకొనే సమయాన్ని సవరించలేదు. నిత్యం ఆలస్యంగానే ఈ రైలు గుంటూరుకు వస్తున్నది. దీనిని కొంతమేరకు తగ్గించడానికి ట్రైన్ నెం.12796 లింగంపల్లి-విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ని లూప్‌లైన్‌లో పెట్టి వందేభారత్‌కి ప్రిసిడెన్స్ ఇస్తున్నారు. శనివారం కూడా ఇదే జరిగింది. వందేభారత్ ఆలస్యమౌతుందని ప్రిసిడెన్స్ ఇచ్చారు. అయినప్పటికీ గుంటూరుకు పావుగంట ఆలస్యంగా వచ్చింది. మరోవైపు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ దాదాపుగా 40 నిమిషాల ఆలస్యమైంది. కాగా పల్నాడు జిల్లాలో ఏదో ఒక రైల్వేస్టేషన్‌లో నడికుడి/పిడుగురాళ్లలో వందేభారత్‌కి నిలుపుదల కల్పించాలని ఇక్కడ ప్రజానీకం కోరుతున్నా రైల్వే శాఖ ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు.

రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కు శిరిపురంలో స్టాపేజ్

రేపల్లె - సికింద్రాబాద్(17646) ఎక్స్‌ప్రెస్‌కి తాజాగా శిరిపురంలో స్టాపేజ్ కల్పించారు. ఈ రైలు నిత్యం ఉదయం 9.29కి శిరిపురం వచ్చి 9.30కి బయలుదేరి వెళుతుంది.

రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చారు

● పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, మార్చి 23: రాష్ట్రాన్ని డ్రగ్స్ అడ్డాగా మార్చి జగన్‌రెడ్డి యువత భవితను చిదిమేస్తున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. కల్తీ మద్యం మాఫియాతో ఇన్నాళ్ళు ప్రజల ప్రాణాలు బలి తీసుకుంటున్నారని, ఇప్పుడు డ్రగ్స్‌తో యువతను భవిష్యత్‌ను చిదిపేస్తున్నారరన్నారు. విశాఖలో దొరికిన భారీ కొకైన్ మాఫియా అంతా జగన్‌పార్టీ వారేనని అన్నారు. విశాఖను స్టేట్ కాపిటల్‌గా మారుస్తానని చెప్పిన జగన్‌రెడ్డి డ్రగ్ మాఫియాగా మార్చారని విమర్శించారు. కూనం పూర్ణచంద్రరావు వైసీపీ సీనియర్ నాయకుడని, కుటుంబం మొత్తం వైసీపీ వ్యవస్థాపక సభ్యులేనని స్పష్టం చేశారు. డ్రగ్ మాఫియాతో ఎలాంటి సంబంధం లేకుండానే బ్రెజిల్ దేశాధ్యక్షుడికి విజయసాయిరెడ్డి ఎందుకు ట్వీట్ చేశారని ప్రశ్నించారు. డ్రగ్స్ మాఫియాకు చెందిన కూనం వీరభద్రరావు కరోనా సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.50 లక్షలు విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. జగన్‌రెడ్డి, వైసీపీ పెద్దలు సిగ్గులేకుండా సోషల్ మీడియాలో ఉద్దేశపూర్వకంగా తెలుగుదేశం పార్టీకి ఆపాదించే కుట్ర చేయటం దుర్మార్గమని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని దింపేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

డ్రగ్స్ కథా చిత్రంలో వేళ్ళన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 23: విశాఖ పోర్టులో పట్టుబడిన భారీ డ్రగ్స్ కంటైనర్ కేంద్రంగా దుమారం రేపుతున్న డ్రగ్స్ కథా చిత్రంలో వేళ్ళన్నీ తాడేపల్లి ప్యాలెస్ పెద్దల వైపే చూపిస్తున్నాయని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో రూ.50వేల కోట్ల విలువైన మత్తు పదార్థాలను ఇంత బాహాటంగా తరలించి తీసుకొని వచ్చారంటే ఏమి చూసుకొని వారికా ధైర్యం అర్థం కావటం లేదన్నారు. రాష్ట్రాన్ని చంద్రబాబు సంస్కరణల్లో, పెట్టుబడుల్లో, అభివృద్ధిలో నెంబర్-1 చేయాలని కలలు కంటే జగన్ ఐదు సంవత్సరాల్లో ఇందుకు పూర్తి విరుద్ధంగా గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడుతూ సంధ్య ఆక్వా ఎండీ పూనం వీరభద్రరావు, సీఈవో కూనం కోటయ్య కుటుంబం నుంచి తొలినుంచి వైసీపీకి అత్యంత సన్నిహితులన్న విషయంపై తాడేపల్లి పెద్దలు ఎందుకు నోరు మెదపటం లేదన్నారు. అన్నింటికీ మించి ఇంటర్‌పోల్ ఇచ్చిన సమాచారం ఆధారంగా సీబీఐ వారు విశాఖ పోర్టులో సోదాలు చేస్తే అక్కడ పోర్టు సిబ్బంది, యంత్రాంగం అడ్డు తగలాలని చూడటం, ఈ విషయాన్ని సీబీఐ స్వయంగా తన ఎఫ్ఐఆర్‌లో ప్రస్తావించటంపై ఏం సమాధానం చెపుతారని ప్రశ్నించారు. మార్చి 16నే కంటైనర్ వస్తే మార్చి 20 వరకు సీబీఐ అధికారులను నిలువరించింది ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందు కోసమే విశాఖను పాలనా రాజధాని అంటూ హడావుడి చేస్తున్నారని ప్రత్తిపాటి ధ్వజమెత్తారు.


విజయవాడలో శనివారం టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా లోకేశ్‌తో మాట్లాడుతున్న ధూళిపాళ్ల నరేంద్రకుమార్ (పొన్నూరు), పక్కన గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పిడుగురాళ్ల మాధవి (గుంటూరు-2), లోకేశ్‌ను ఆలింగనం చేసుకుంటున్న అనగాని సత్యప్రసాద్ (రేపల్లె), లోకేశ్‌తో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు (గురజాల), టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు నమస్కరిస్తున్న జనసేన తెనాలి అభ్యర్థి నాదెండ్ల మనోహర్

వైసీపీకి మాజీ జెడ్పీటీసీ మర్రి రాజీనామా

రాజుపాలెం, మార్చి 23: మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన మర్రి వెంకటరామిరెడ్డి వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన 2014నుంచి 2019వరకు రాజుపాలెం మండల జెడ్పీటీసీగా కొనసాగారు. ఆ సమయంలో పార్టీ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. వెంకటరామిరెడ్డిపై మర్డర్ కేసు నమోదుకు ప్రయత్నించి 14గంటల పాటు పోలీస్‌స్టేషన్లో ఉంచి మానసికంగా ఇబ్బందికి గురిచేశారు. పార్టీలో తనకు జరుగుతున్న అవమానాలను భరించలేక, ఆత్మగౌరవం లేని చోట పనిచేయటం ఇష్టంలేక రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.


మర్రి వెంకటరామిరెడ్డి

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, మార్చి 23: చైన్‌స్నాచింగ్ కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. రూ.8లక్షల విలువైన 16 సవర్ల బంగారాన్ని చోరీచేసిన కేసులో నిందితులైన ప్రకాశం జిల్లా బుల్లికురవకు చెందిన షేక్ నాగూర్‌బాషా, పల్నాడు జిల్లా దమ్మాలపాడుకి చెందిన ఆరె మురళీమోహన్‌రెడ్డిలను శనివారం పల్నాడు రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద అరెస్టుచేసినట్టు మొదటి పట్టణ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. నరసరావుపేట, నాదెండ్ల, నకరికల్లు తదితర పోలీసుస్టేషన్ల పరిధిలో ప్రస్తుతం ఆరు కేసుల్లో నాగూర్ నిందితుడు. సమావేశంలో రెండో పట్టణ సీఐ భాస్కర్, ఎస్ఐ అశోక్, సిబ్బంది సుబ్బారావు, తిరుమల, వీరాంజనేయులు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు.

రూ.92 వేల నగదు స్వాధీనం

తాడికొండ, మార్చి23: తాడికొండ అడ్డరోడ్డులో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం గుంటూరుకు చెందిన ముద్రబోయిన మాధవ్ కారును తనిఖీ చేయగా రూ.92 వేల నగదును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మాధవ్‌ను విచారించగా రియల్ ఎస్టేట్ ప్లాట్లకు సంబంధించిన నగదు అని చెప్పారు. ఎలాంటి బిల్లులు లేకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	121, 129,140
చికెన్ విత్ స్కిన్	228.00
చికెన్ స్కిన్ లెస్	238.00

పోలీసు అధికారులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్


ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, మార్చి 23 : పోలీసు అధికారులు, సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పోలీసులను ఉపేక్షించబోమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. శనివారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అనుసరించాలన్నారు. ఎన్నికలలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ క్రమశిక్షణకు మారుపేరైన పోలీసుశాఖ దీనికి అతీతంకాదని, పోలీసుశాఖలో విధులు నిర్వహించే వారే మరింత ఖచ్చితత్వంతో నియమావళిని అనుసరించాలన్నారు. బాపట్ల జిల్లా సంతమాగులూరు సర్కిల్ పరిధిలోని బల్లికురవ పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పి.నాగశివారెడ్డిపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై స్పందిస్తూ కిరణా షాపులో వ్యక్తిమీద దురుసుగా వ్యవహరించిన విషయంలో ఇప్పటికే శాఖాపరమైన చర్యలు తీసుకున్నామని, పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకులు వచ్చి సదరు ఎస్సైకు శాలువాను కప్పినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరుపుతున్నామన్నారు. ఇప్పటికే ఎస్సైకి షోకాజ్ నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించి విచారణ చేపట్టామన్నారు. విచారణ ముగిసిన అనంతరం విచారణాధికారి ఇచ్చే నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం


ఉపకరణాల నిర్ధారణ శిబిరంలో పరీక్షిస్తున్న వైద్యులు

బాపట్ల, మార్చి 23 : సమగ్రశిక్ష ప్రత్యేక అవసరాల గల బాలబాలికలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం బాపట్ల జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎంవీ సుధాకర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మెడికల్ క్యాంప్ నిర్వహించటం జరిగిందన్నారు. సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎం.జోత్స్న మాట్లాడుతూ జిల్లాలోని ఒక్కొక్క మండలంలోని భవితసెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నిమిత్తం ఈ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. 70 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన పరికరాలను పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. నేత్రవైద్య నిపుణులు డాక్టర్ లాస్య, నివేదిత, నాగకోటేశ్వరరావు, శ్రీధర్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు, సీఆర్పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో తనిఖీ


విద్యాప్రగతి గురించి తెలుసుకుంటున్న నజ్మాఖాతున్

పిట్టలవానిపాలెం, మార్చి 23 : మండల పరిధిలోని చందోలు గ్రామ పంచాయతీలోని నదిముల్లాపాలెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలను వార్షిక తనిఖీలలో భాగంగా ఉర్దూ పాఠశాలల బాపట్ల రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ నజ్మాఖాతున్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న చిన్నారుల విద్యాప్రమాణాలు గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ రహంతుల్లాను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో విద్యావిధానాలు, ప్రభుత్వపరంగా అందించే వసతులు, జగనన్న గోరుముద్ద తదితర అంశాలు గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులతో పాఠ్యాంశాలు చదివించి విద్యపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రహంతుల్లా ఉపాధ్యాయులు ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం

పిట్టలవానిపాలెం, మార్చి 23 : మండల పరిధిలోని కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవం కళాశాల పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బాపట్ల జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గడ్డిపాటి అనీల్‌కుమార్ పాల్గొన్నారు. కళాశాలలో వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించిన విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి విజయం కుటుంబం మొత్తం స్థిరపడటానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమ్మాజి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్‌పై వివిధ సూచనలు చేశారు. ఈ వేడుకలలో కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్‌లు పాల్గొని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత : ఏఈ

కర్లపాలెం, మార్చి 23 : కర్లపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి 8 ఎంయూఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మండల విద్యుత్ శాఖాధికారి మల్లెల కుమార్ తెలిపారు. రూ.75 లక్షలతో లోఓల్టేజి సమస్యను అధిగమించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఏర్పాటు చేస్తున్నామని ఈ కారణంగా ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని ఏఈ తెలిపారు.

పది పరీక్షలకు 35 మంది గైర్హాజరు

కర్లపాలెం, మార్చి 23 : కర్లపాలెం మండలంలో మూడు సెంటర్‌లలో జరుగుతున్న పదవ తరగతి పరీక్షలకు 35 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి విజయశ్రీ తెలిపారు.

హైవేపై అదుపు తప్పిన కారు

బాపట్ల,మార్చి23 : బాపట్ల-చీరాల జాతీయ రహదారిపై శనివారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. బెలూన్‌లు ఓపెన్ కావటంతో కారులో ప్రయాణిస్తున్న వారికి ప్రమాదం తప్పింది. హైవే బైపాస్ మీద నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. అధికారులు సరైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఓటు హక్కు సద్వినియోగపర్చుకోవాలి

కర్లపాలెం, మార్చి 23 : ఓటర్లు అందరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును సక్రమంగా సద్వినియోగపర్చుకోవాలని కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. మండలంలోని యాజలి గ్రామంలో స్వీప్ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమనిబంధనలకు అనుగుణంగా ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ఓటర్లు పాల్గొన్నారు.

విప్లవ వీరకిశోరం భగత్‌సింగ్

● డాక్టర్ పీసీ సాయిబాబు


భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

బాపట్ల, మార్చి 23 : పిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసి అమరుడైన భగత్‌సింగ్ విప్లవ వీరకిశోరమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం ఫోరం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. భగత్‌సింగ్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో సాయిబాబు మాట్లాడుతూ విప్లవమార్గాన్ని ఎంచుకొని అలుపెరగని పోరాటం చేసిన ఆయన దేశభక్తి అజరామరమన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జమృద్‌బాషా, రామకోటేశ్వరరావు, సురేష్, దాసరి లక్ష్మీ ఉన్నారు.

మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో..

బాపట్ల, మార్చి 23 : భగత్‌సింగ్ స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల దాస్యశృంఖలాల నుంచి భారతదేశ విముక్తి కోసం 23 సంవత్సరాల వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. జిల్లా కమిటీ సభ్యుడు టి.కృష్ణమోహన్, సీఐటీయూ నాయకులు సీహెచ్ మజుందార్, కె.శరత్, సీనియర్ నాయకుడు నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, నాగేశ్వరరావు, టి.సుభాషిణి, బుచ్చిరాజు, రవి, దాసరి లక్ష్మి పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

కొల్లూరులో...

కొల్లూరు, మార్చి 23 : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, సీఐటీయూ నాయకులు శనివారం కొల్లూరులోని బీఆర్‌కే శాస్త్రి ఐటిఐ కళాశాలలో ఆయన చిత్రపటానికి కళాశాల కరస్పాండెంట్ రామకృష్ణశాస్త్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య మాట్లాడుతూ, బ్రిటీష్ పాలకుల నుంచి భారతదేశాన్ని విముక్తి చేయడం కోసం 23 సంవత్సరాల వయసులోనే ప్రాణత్యాగం చేసిన మహోన్నతుడు భగత్‌సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుబ్బారావు, కళాశాల ప్రిన్సిపల్ గుమ్మడి శ్రీనివాసరావు, అధ్యాపకులు రాజేష్, రమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు అభిషేక్, విద్యార్థులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామకృష్ణశాస్త్రి, ప్రజా సంఘాల నాయకులు

రేపల్లెలో...

రేపల్లె, మార్చి 23 : దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్ ఆశయాలను యువత పుణికి పుచ్చుకుని ముందుకు వెళ్ళాలని సీపీఎం రేపల్లె ఏరియా కార్యదర్శి సిహెచ్ మణిలాల్ అన్నారు. భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చిన్న వయసులోనే ప్రాణాలు అర్పించారన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజావ్యతిరేక నిరంకుశ విధానాలపై ప్రజలంతా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఆశీర్వాదం, కెవీ లక్ష్మణ్‌రావు, వైనవీన్, బి అగస్టీన్, అరుణ్, వాసు తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు, మార్చి 23 : భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక టీఎంరావ్ హైస్కూలులో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పప్పుల మనోజ్‌కుమార్ మాట్లాడుతూ బ్రిటీష్ పార్లమెంట్ మీద బాంబు దాడి చేశారనే నేరాభియోగంతో భగత్‌సింగ్, రాజుగురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీశారని అమరవీరులు దేశం కోసం ప్రాణాలు అర్పించి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు

మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

బాపట్ల, మార్చి 23 : పట్టణంలోని విజయలక్ష్మీపురం మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యాలయంలో శనివారం అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల పటాలకు సంఘ అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1931 మార్చి 23వ తేదిన అప్పటి ఆంగ్లేయులకు వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లను ఉరితీసిన రోజును దేశవ్యాప్తంగా అమరవీరుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు సుంకర శేషగిరిరావు, సీనియర్ మాజీ సైనికులు తోట దుర్గారావు, సిహెచ్‌వీ కృష్ణారావు, అబ్దుల్ రజాక్, పసుపులేటి ప్రసాద్, పి.రాధాకృష్ణమూర్తి, కె.అంజనేయులు, డి.వెంకటేశ్వర్లు, ఈపూరి చంద్రమోహన్, శ్రీనివాసరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ పటాలకు పుష్పాంజలి తాండ్ర సాంబశివరావు తదితరులు

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి

● పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

పిట్టలవానిపాలెం, మార్చి 23 : విద్యార్థులు విద్యతోపాటు క్రీడాస్ఫూరితో రాణించేలా కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీకళాశాల పాలకవర్గం చేస్తున్న కృషితో పాటు విద్యాపరంగా ఉపయోగపడేవిధంగా పేద, మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందించటం ఎంతో అభినందనీయమని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్‌కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల, డాక్టర్ డి.ఎస్.రాజు జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు శనివారం నగదు బహుమతుల పంపిణీ కార్యక్రమానికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొని రెండు కళాశాలల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మంచి నడవడిక కలిగి ఉండి విద్యాభ్యాసంలో రాణించే విద్యార్థులు ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. కళాశాల ప్రాంగణంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కళావేదికలో జరిగిన కార్యక్రమానికి కళాశాలపాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ మంతెన నరసరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కళాశాల సెక్రటరి అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాస్‌కుమార్, కళాశాల జాయింట్ సెక్రటరి మంతెన కృష్ణంరాజు బహుమతులను అందజేశారు. తొలుత నూతనంగా ఏర్పాటు చేసిన నన్నయ్య విగ్రహాన్ని ముఖ్యఅతిథిగా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ పాలకవర్గ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శివప్రసాద్, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ బి.సుబ్బరాజు, విద్యార్థిని, విద్యార్థులు, కళాశాలపాలకవర్గ సిబ్బంది పాల్గొన్నారు.


కళాశాల ప్రాంగణంలో నన్నయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, కళాశాల పాలకవర్గం అధ్యక్షులు డాక్టర్ మంతెన నరసరాజు తదితరులు


ప్రచారంలో పాల్గొన్న అఖిలేశ్ తదితరులు

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నక్కా అఖిలేశ్

వేమూరు, మార్చి 23 : వేమూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ మంత్రి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు విజయాన్ని కోరుతూ ఆయన కుమారుడు డాక్టర్ అఖిలేశ్ శనివారం సాయంత్రం మండలంలోని జంపని గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా సిద్ధి గణపతి మహాలక్ష్మి అమ్మవారి ఆలయాలలో పూజలు నిర్వహించి అనంతరం చర్చిలో పాస్టర్ నుంచి ఆశీర్వాదం పొందారు. తదుపరి ఇంటింటికి వెళ్లి తెలుగుదేశం పార్టీకి ప్రతి ఒక్కరూ ఓటు వేసి రాష్ట్ర అభివృద్ధి కోసం, రాష్ట్ర ప్రజల కోసం తోడ్పడాలని కోరారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వేమూరు స్థానం నుండి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన తండ్రికి విజయం సాధించి పెట్టాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ తొలివిడతగా విడుదల చేసిన మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ హనీఫ్ నాయకులు వేల్పుల రవి, వట్టిప్రోలు యోబు, లక్ష్మీ దుర్గా, పల్లా వాసుదేవరాయుడు, వేమూరి మురళీకృష్ణ, బోగి అంకమ్మరావు, తొలుచూరి కోటయ్య, గండికోట నాగరాజు, షేక్ ఆరీఫ్, షేక్ సుభాని, కొడాలి వెంకటరావు, కలవ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

తిరునాళ్లలో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

● రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ

కొల్లూరు, మార్చి 23 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ అమలులో ఉన్నాయని, తిరునాళ్లలో ఎటువంటి ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ హెచ్చరించారు. కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, కొల్లూరు మండల పరిధిలోని దోనేపూడి, పెసర్లంక గ్రామాల్లోని తిరుపతమ్మ తల్లి, నాంచారమ్మ తల్లి తిరునాళ్లు, భట్టిప్రోలులోని శివాలయం రథోత్సవ కార్యక్రమాలు ఆదివారం జరగనున్నాయని, ఆయా కార్యక్రమాలకు దైవదర్శనం నిమిత్తం వెళ్లే మహిళా భక్తులు తమ బంగారు ఆభరణాలను జాగ్రత్త చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు జరగకుండా కేటాయించిన ప్రాంతాల్లోనే వాహనాలు నిలుపుదల చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున భక్తులు ట్రాక్టర్లు, మోటారువాహనాలపై రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, ఫ్లెక్సీలు, కరపత్రాలు ప్రదర్శించకూడదన్నారు. వాహనాలపై మైకు వినియోగించుకోవాలని అనుకునే వారు ముందుగా పోలీసు అనుమతి పొంది ఉండాలని చెప్పారు. సమావేశంలో సీఐ రామకృష్ణ, ఎస్ఐ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

16 మంది జూదరుల అరెస్టు

రేపల్లె, మార్చి 23 : పట్టణంలోని 10వ వార్డులోని ఓ నివాస గృహంలో పేకాట ఆడుతున్న వారిపై రేపల్లె రూరల్ సర్కిల్ పోలీసులు శనివారం దాడి చేశారు. ఈ దాడిలో 16 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ నజీర్ బేగ్ మాట్లాడుతూ 16 మంది పట్టణానికి చెందిన న్యాయవాదులు, ఉద్యోగస్తులు, పలువురిని అరెస్టు చేయటం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రూ.63,910లు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏడు ద్విచక్ర వాహనాలు, 14 సెల్‌ఫోన్‌లను స్వాధీనపర్చుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేడు భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దివ్య రథోత్సవం

● రాత్రి నేత్రపర్వంగా స్వామివార్ల కల్యాణం


36 అడుగుల ఎత్తయిన రథం

భట్టిప్రోలు, మార్చి 23 : అద్దేపల్లి-భట్టిప్రోలు పద్మశాలీయ బహూత్తమ సంఘీయుల ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి జగజ్యోతి, ఎదురుకోల కార్యక్రమాల అనంతరం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని కౌతరపు పిచ్చియ్యశాస్త్రి-విజయలక్ష్మి దంపతులచే వేద బ్రాహ్మణులు దండిభొట్ల కనకసుందరశర్మ, కౌతా సత్యనాగ వెంకట రాజేష్‌శర్మ శాస్త్రయుక్తంగా జరిపించారు. కల్యాణమూర్తులైన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవం అనంతరం ఆదివారం సాయంత్రం ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద రథాల్లో 36 అడుగుల ఎత్తయిన భట్టిప్రోలులోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి రథం ఒకటిగా ఖ్యాతి గడించింది. వంశపారంపర్య ధర్మకర్తలు కొడాలి వంశీయులు, పద్మశాలీయ సంఘీయులు ఉత్సవాలను పర్యవేక్షణ గావిస్తున్నారు.

ఇరుకు రహదారిలోనే భట్టిప్రోలు రథోత్సవం

కుల మతాలకు అతీతంగా జరుపుకునే భట్టిప్రోలు తిరునాళ్ళలో ప్రధాన ఘట్టమైన రథోత్సవం జరిగే రోడ్డు మార్గం ప్రతి ఏడాది కుదించుకుపోతుండడంతో రథోత్సవం సాఫీగా జరిగేనా అన్న సందేహాలు భక్తులు వ్యక్తం చేస్తున్నారు. రోజు రోజుకు రహదారి ఇరుకుగా మారుతుండడం ఇరుకు మార్గంలోనే ప్రతి ఏటా రథోత్సవాన్ని భయభయంగా జరుపుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వామివారికి డీఎస్పీ మురళీకృష్ణ పూజలు

శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో రేపల్లె డీఎస్పీ మురళీకృష్ణ శనివారం పాల్గొన్ని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జరిగే దివ్య రథోత్సవం రూటు, వివరాలను కార్యనిర్వహణాధికారి వెంకట అప్పలాచార్యులు, పద్మశాలీయ సంఘీయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వేమూరు సీఐ పి. రామకృష్ణ, ఎస్ఐ కె.శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

పెదపులివర్రులో...

మండలంలోని పెదపులివర్రులో గల శ్రీ భూనీళా సమేత వరదరాజస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి స్వామి కల్యాణోత్సవం అనంతరం దివ్య రథోత్సవం గరుడోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను ధర్మకర్తల మండలి సభ్యులు, గ్రామ పెద్దలు పర్యవేక్షణ గావిస్తున్నారు.

రహదారిపై మురుగునీరు.. పట్టించుకోని అధికారులు

చెరుకుపల్లి, మార్చి 23 : మురుగునీరు రహదారిపై నిల్వ ఉండి దుర్వాసనలు వెదజల్లుతున్నా అధికారులు పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని చెరుకుపల్లి సంత బజారు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ దగ్గరలో ఉన్న సంతబజారులోని రహదారిపై మురుగునీటి నిల్వ ఏర్పడి నడవటానికి కష్టంగా ఉన్నా నీటి తొలగింపునకై చర్యలు చేపట్టకపోవడంతో నీటి నిల్వలోనే రాకపోకలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. ప్రతి శనివారం ఈ రహదారిలో కూరగాయల సంత జరుగుతుంది. కూరగాయల కొనుగోలుకు మండలంలోని 16 పంచాయతీలలోని ప్రజలు వస్తారు. అయినప్పటికి అధికారులు నిల్వ ఉన్న నీటి తొలగింపులో చొరవ చూపడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నీటి నిల్వలు ఏర్పడంతో దోమలు వృద్ధి చెంది రాత్రి సమయంలో కంటిపై కునుకుపట్టకుండా చేస్తున్నాయని ప్రజలు తెలుపుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రహదారిపై నీటి నిల్వలు తొలగింపునకు చొరవ చూపాలని సంత బజారులో నివాసం ఉంటున్నట్లు ప్రజలు కోరుతున్నారు.


చెరుకుపల్లి సంత బజార్‌లో నిలిచిన మురుగునీరు

టీడీపీలోకి వెల్లువలా చేరికలు

భట్టిప్రోలు, మార్చి 23 : మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మంత్రిగా పని చేసిన సమయంలో చేసిన అభివృద్ధిని చూసి నమ్మకంతో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని పల్లెకోన గ్రామ మాజీ సర్పంచ్ మండవ రామకోటేశ్వరరావు, రాచూరు గ్రామానికి చెందిన కె.కుమారస్వామిలతో పాటుగా జొన్న సురేష్, జొన్న శ్రీనివాసరావు తదితర కుటుంబాలు టీడీపీలో చేరాయి. గుంటూరులోని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో శనివారం రాత్రి ఆయా కుటుంబాలు పార్టీలో చేరగా మాజీ మంత్రి ఆనందబాబు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాయన ప్రసాద్, వేజళ్ళ సతీష్, వేముపల్లి రఘుబాబు, ఎస్. అంజిబాబు, చిలకా పాములు, రావూరి వరప్రసాద్, కోటేశ్వరరావు, పురమా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

● స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన శివప్రసాద్

రేపల్లె, మార్చి 23 : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివప్రసాద్‌ను ఆలయ అర్చకుడు దుశ్శాలువాలతో సన్మానించి వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ట్రస్టీ గడ్డం రాధాకృష్ణ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదానంలో వేలాది మంది భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.


బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అనగాని శివప్రసాద్

శ్రీలక్ష్మీనరసింహస్వామి...

చెరుకుపల్లి, మార్చి 23 : మండలంలోని గూడవల్లి గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రతినిత్యం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలను అందించారు. ఈనెల 26వ తేదీ వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయన్నారు.

శింగరకొండలో వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం

అద్దంకి, మార్చి 23: శింగరకొండ లక్ష్మీనరసింహ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి వార్ల 69వ వార్షిక తిరునాళ్ల ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన జరిగింది. ధ్వజస్తంభ నిర్మాణదాత, పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మేదరమెట్ల శంకరారెడ్డి, ఈవో సుభద్ర జీవధ్వజ పూజ, ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ నిర్వహించారు. మేదరమెట్ల రాజశేఖరరెడ్డి, మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరావు, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు. భజన, మహిరావణ చరిత్ర తోలుబొమ్మలాట, కోలాట ప్రదర్శనం విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. ఏర్పాట్లను ఫెస్టివల్ ఆఫీసర్ తిమ్మనాయుడు, ఈవో సుభద్ర పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, విశేష అభిషేకం జరగనున్నాయి. రుత్వికులచే మహన్యాస పూర్వక ఏకాదశ మన్యుసూక్త వారాభిషేక, సుందరకాండ పారాయణ, సూర్య నమస్కారాలు, సప్తశతి పారాయణ, పంచామృతాలు, దశ విధ ద్రవ్యాలచే విశేష అభిషేకం, విశేష అలంకరణ నిర్వహించనున్నారు. లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద పాలకమండలి చైర్మన్ నర్రావుల ఏడుకొండలు, ఈవో కోటిరెడ్డి ధ్వజస్తంభ పూజ, పతాక పూజలు నిర్వహించారు. ప్రధాన తిరుణాళ్ల సోమవారం జరగనుంది.


ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద ఉష్ట్ర పతాక పూజ, ధ్వజారోహణ చేస్తున్న మేదరమెట్ల శంకరారెడ్డి, ఈవో సుభద్ర


ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

ట్రాఫిక్ మళ్లింపుపై ప్రత్యేక దృష్టి

అద్దంకి, మార్చి 23: శింగరకొండ 69వ వార్షిక తిరునాళ్ల ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేస్తున్నట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ తెలిపారు. శింగరకొండ తిరుణాళ్ళ, ట్రాఫిక్ మళ్లింపుపై శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రభల నిర్వహకులతో చర్చించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇతరులను కించ పరిచేవిధంగా, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయరాదన్నారు. రాజకీయపార్టీల జెండాలు, గుర్తులు ప్రదర్శించరాదన్నారు. అసభ్యకరమైన నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతి భద్రతలకు భంగం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

శింగరకొండ దేవాలయాల పరిసరాలు, ప్రవేశ మార్గాలు, ప్రభలు ఉంచే ప్రదేశాలను అడిషనల్ ఎస్పీ పరిశీలించారు. తిరునాళ్లకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ మళ్లింపునకు సంబంధించి పోలీస్ అధికారులతో చర్చించారు. తిరునాళ్లకు సుమారు 750 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్టు చెప్పారు. సోమవారం ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు తెలిపారు. ఒంగోలు వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను మేదరమెట్ల నుంచి చిలకలూరిపేట మీదుగా నర్సరావుపేట వైపు, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను సంతమాగులూరు అడ్డరోడ్డు నుంచి నర్సరావుపేట, చిలకలూరిపేట, మేదరమెట్ల మీదుగా మళ్లిస్తున్నట్టు చెప్పారు.

కడప వైపు నుంచి విజయవాడ వైపు వెళ్ళే వాహనాలు పొదిలి, ఒంగోలు మీదుగా మళ్లిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.


లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న నర్రావుల కొండలు, ఈవో కోటిరెడ్డి


వృద్ధుడిపై ఎస్ఐ దాడిచేసిన సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

వృద్ధుడిపై ఎస్ఐ దాడి ఘటనపై డీఎస్పీ విచారణ

బల్లికురవ, మార్చి 23: బల్లికురవలో వృద్ధుడు హనుమంతరావుపై ఎస్ఐ నాగశివారెడ్డి దాడి చేసిన సంఘటనపై బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ శనివారం రాత్రి విచారణ చేపట్టారు. నాలుగు రోజుల క్రితం బల్లికురవలో బడ్డీ బంకులో ఉన్న వృద్ధుడు శానంపూడి హనుమంతరావుపై ఎస్ఐ దాడిచేసి మద్యం అమ్మకాలు చేస్తున్నట్లు కేసు నమోదు చేశారు. ఈ దాడిలో అస్వస్థతకు గురైన వృద్ధుడు ఒంగోలు రిమ్స్ వైద్యశాలలో చేరి అక్కడనుంచి ఎస్ఐ నాగశివారెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను అకారణంగా కొట్టి తన వద్ద మద్యం సీసాలు లేకపోయినా, ఉన్నట్లు కేసు పెట్టారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇదే విషయమై ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శుక్రవారం సాయంత్రం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. దీంతో బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, సంతమాగులూరు సీఐ నరసింహారావులు శనివారం రాత్రి సంఘటన జరిగిన ప్రదేశం తోపాటు వృద్ధుడు నివాసం ఉంటున్న ఇంటి వద్ద విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధుడి మనుమరాలు దుర్గ విచారణకు వచ్చిన డీఎస్పీతో తాము టీడీపీ సానుభూతిపరులమని, తమపై కక్ష కట్టి తమ దుకాణంలో ఎస్ఐ తరచూ తనఖీలు చేస్తున్నారని చెప్పారు. ప్రయివేట్ వ్యక్తులను తీసుకువచ్చి తనిఖీ చేస్తున్నారని తెలిపారు. తమ దుకాణంలో మద్యం దొరకలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సీసీ ఫుటేజ్‌ను కూడా పరిశీలించాలని కోరారు. వృద్ధుడు హనుమంతరావు మాట్లాడుతూ ఎస్ఐ అకారణంగా కొట్టి జీపులో స్టేషన్‌కు తీసుకువెళ్ళారని తెలిపారు. తాను ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టలేదని, తనపై అక్రమంగా కేసు బనాయించారని డీఎస్పీతో తెలిపారు.

గ్రామాల్లో కేంద్ర బలగాలు కవాతు


పెదగంజాం గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చినగంజాం, మార్చి 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు శనివారం కవాతు నిర్వహించారు. ఎస్ఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజుబంగారుపాలెం, కుక్కలవారిపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ఘర్షణలు, అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

అద్దంకి, మార్చి 23: మద్యం తీసుకువెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 30 బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. శింగరకొండపాలెంకు చెందిన గోవిందు అద్దంకి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రాత్రి 30 మద్యం బాటిళ్లతో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకొని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఎమ్మెల్యే స్వామి మాతృమూర్తి మృతికి రవికుమార్ సంతాపం

అద్దంకి, మార్చి 23: కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాతృమూర్తి సుబ్బమ్మ మృతి పట్ల అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే స్వామికి రవికుమార్ ఫోన్ చేసి మాట్లాడారు.

ఈవీఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 23: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)ల భద్రతకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎం గోడౌన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపర్చిన సీల్స్‌ను తనిఖీ చేశారు. కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను అసిస్టెంట్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి పరిశీలించారు. అక్కడ అమర్చిన సీసీకెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతా ఏర్పాట్లలో భాగంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాడ్స్ గోడౌన్‌ను పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదికను పంపనున్నట్లు తెలిపారు. ఒకేసారి పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నందున అవసరమైన వీవీప్యాడ్లు, కంట్రోలు యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డీఎస్.క్రాంతికుమార్, కాలేషాబే గ్, రసూల్, ఎస్‌డీ.హనీఫ్, డి.యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాదారుల నుంచి వసూళ్లు

- మూడు రోజుల నుంచి తెరలేపిన ఎస్ఈబీ అధికారులు


గుండ్లకమ్మ నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలు

అద్దంకి, మార్చి 23: గుండ్లకమ్మ నదిలో ఇసుక రవాణాపై ఒకవైపు సీన రేజ్ వసూళ్లు జరుగుతుండగా, మరోవైపు ఎస్ఈబీ అధికారులు వసూళ్లపర్వం కొనసాగిస్తున్నారు. గుండ్లకమ్మ నదిలో అద్దంకి ప్రాంతంలో ఎలాం టి అధికారిక ఇసుక రీచ్ లేదు. అయినప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సీనరేజ్ వసూళ్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న కార్పొరేట్ సంస్థలు గత నాలు గేళ్లుగా అనధికారికంగా సీనరేజ్ వసూళ్లు చేస్తూనే ఉన్నారు. మధ్యలో కొం తకాలం సీనరేజ్ వసూలు నిలిపి వేయటంతో పాటు ఇసుక రవాణా జర గకుండా అడ్డుకున్నారు.

అయితే, గత నెల రోజులుగా మరలా ఇసుక రవాణా పునఃప్రారంభమైంది. ఇసుక సీనరేజ్ రూపేణ ఒక్కో ట్రాక్టర్‌కు రూ.1400 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇది చాలదన్నట్లు గత రెండు మూడు రోజులుగా ఎస్ఈబీ అధికారులు రంగప్రవేశం చేసి ఇసుక రవాణాదారుల నుంచి వసూళ్లపర్వానికి తెరలేపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.7 వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. రోజుకు సరాసరిన అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి సుమారు వంద ట్రాక్టర్‌ల ఇసుక రవాణా జరుగుతుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత కొంత మంది ఇసుక రవాణాదారులు సీనరేజ్ బిల్లులు చెల్లించకుండానే వెళ్తున్నట్లు తెలుస్తుంది. ఈనేపథ్యంలో ఎస్ఈబీ అధికారులు వసూళ్లపర్వానికి తెరలేపినట్లు విమర్శలు వస్తున్నాయి. వచ్చిన కాడికి దండుకొని జేబులలో వేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఎస్ఈబీ అధికారులు దందాకు తెరలేపటం మరింత విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ సీనరేజ్ వసూలు అరికట్టడంతో పాటు, ఎస్ఈబీ అధికారుల వసూళ్లపర్వానికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవీందర్


రాజకీయ పార్టీ నేతలకు సూచనలు చేస్తున్న ఆర్వో రవీందర్

పర్చూరు, మార్చి 23: మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలు, ర్యాలీలు, పార్టీ కార్యాలయాలు ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పర్చూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా రాజకీయ పార్టీల నేతలు, అధికారులతో ఎన్నికల నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలు, జాగ్రత్తలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆర్వో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలకనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూలు తేదీ నుంచే కోడ్ అమల్లో ఉందని చెప్పారు. అనుమతులకు వివిధ యాప్‌ల ద్వారా గానీ, ఆర్వో ఆఫీసు ద్వారా కాని 24 గంటల వ్యవధిలోనే అనుమతులు పొందవచ్చునని చెప్పారు. ప్రతి రాజకీయ పార్టీ ఎన్నికల నియమావళిని విధిగా పాటించాలన్నారు. విధి నిర్వహణలో అధికారులు సమన్వయంగా పనిచేయాలన్నారు.

సమావేశంలో పర్చూరు, మార్టూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చిన్నగంజాం తహసీల్దార్‌లు సీహెచ్ సుబ్బయ్య, కె.సంధ్య, వై.నాగరాజు, మోహర్‌బాబు, ఎం.ప్రమీల, జీవీఎస్ ఫణీంద్రబాబు, ఎంపీడీవోలు నితిన్, శ్రీదేవి, శ్రీనివాసరెడ్డి, వరప్రసాద్, ఆయా రాజకీయ పార్టీల నేతలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ పోలీసుల అదుపులో గ్రానైట్ లారీలు


ఇటీవల మార్టూరు పోలీసులకు పట్టుబడిన గ్రానైట్ శ్లాబుల లారీలు (ఫైల్)

మార్టూరు, మార్చి 23: మార్టూరు ప్రాంతం నుంచి తెలంగాణ రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలుతున్న ఎలాంటి బిల్లులు లేని గ్రానైట్ శ్లాబుల లారీలను తెలంగాణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం వేకువ జామున వీటిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. దాదాపుగా పదికి పైగా గ్రానైట్‌శ్లాబుల లారీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇంకా అదనంగా లారీలు ఉండవచ్చునని సమాచారం. నల్గొండ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా చేపట్టిన తనిఖీలలో భాగంగా లారీలను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వాటిలో మార్టూరు, బల్లికురవ మండలాలకు చెందిన గ్రానైట్ పరిశ్రమల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా ఇతర రాష్ట్రాలకు గ్రానైట్ అక్రమార్కులు తరలించే లా రీలు ఉన్నట్లు తెలిసింది.

మార్టూరు, బల్లికురవ ప్రాంతాల నుంచి గ్రానైట్ అక్రమ రవాణా చేసేవారు ఆరితేరి పోయారు. రోజూవారీ, నెలవారీ జీతాలకు పనిచేసే వారు కొంతమంది గ్రానైట్ అక్రమ మార్గంలో రవాణా చేస్తూ కోట్లాది రూపాయలను సంపాదించిన వారు మార్టూరులో స్థిర నివాసంగా ఉంటున్నారు. వారిపై గతంలో ఈ గ్రానైట్ అక్రమ రవాణాకు సంబంధించి మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు పోలీస్ స్టేషన్‌లలో కేసులు కూడా ఉన్నాయి. వారందరూ పర్చూరు నియోజకవర్గం వైసీపీ సమన్వయ కర్తగా పనిచేసి, ఇటీవల నియోజకవర్గం నుంచి వెళ్లిపోయిన నాయకుడి అనుచరుల కనుసన్నల్లో. వారి అండదండలతో నిరాటంకంగా గ్రానైట్ అక్రమ రవాణాను కొనసాగిస్తూ లక్షలాది రూపాయలను సంపాదించారు. అయితే, నియోజకవర్గ సమన్వయ కర్త మారిన తర్వాత గ్రానైట్ అక్రమార్కులు కొంత పంథాను అనుసరించారు. గ్రానైట్ అక్రమ రవాణాను నిర్భయంగా కొనసాగిస్తున్నారు.

అయితే, ఇటీవల స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డి మార్టూరులోనే రెండు గ్రానైట్ అక్రమ శ్లాబుల లారీలను అదుపులోకి తీసుకున్నారు. అయినా గ్రానైట్ అక్రమార్కులు మరింతగా అక్రమ రవాణాలో మునిగిపోయారు. ఈనేథ్యంలో తెలంగాణ పోలీసులు ఈ ప్రాంతానికి చెందిన లారీలను అదుపుతోకి తీసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న పదికిపైగా గ్రానైట్ శ్లాబుల లారీలను అదుపులోకి తీసుకున్నారన్న సంఘటన అక్రమార్కుల్లో గుబులు రేపింది.

కదలని అక్రమ శ్లాబుల లారీలు

తెలంగాణా పోలీసులు మార్టూరు ప్రాంతం నుంచి తెలంగాణకు, ఇతర రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ శ్లాబుల లారీలను పట్టుకున్నారన్న వార్తతో అక్రమ వ్యాపారులు సందిగ్ధంలో పడిపోయారు. ఏడాదికిపైగా అక్రమ వ్యాపారం చేసినవారు తెలంగాణ పోలీసుల వైఖరితో ఏంచేయాలో మదనపడుతున్నారు. దాంతో రోజూ 40 నుంచి 60 దాకా ఈప్రాంతం నుంచి అక్రమ గ్రానైట్ శ్లాబులను ఇతర రాష్ట్రాలకు తరలించే వ్యాపారులు శనివారం ఒక లారీని కూడా ఈ ప్రాంతం నుండి బయటకు పంపించడానికి సాహసం చేయలేకపోయారు. మన రాష్ట్రం నుండి తెలంగాణ రాష్ట్రం దాటించడానికి ఒక లారీకి రూ.20 వేల నుంచి రూ.25 వేలు దాకా మామూళ్లు ద్వారా ఖర్చుపెట్టే అక్రమ వ్యాపారులు తెలంగాణలో శుక్రవారం బ్రేక్ పడటంతో ప్రత్యామ్నాయదారులు వైపు తెలంగాణకు పరుగెత్తారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ అక్రమ వ్యాపారంలో యువకులు ఆరితేరిపోయారు. తెలంగాణ పోలీసులు గ్రానైట్ లారీలను అదుపులోకి తీసుకోవడం ఇది తొలిసారి కావడం విశేషం. ఈ ఉదంతంతోనైనా మన పరిధిలో మైనింగ్, విజిలెన్స్ అధికారులు గ్రానైట్ అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతారో లేదో వేచి చూడాల్సిందే.

వేధిస్తున్న కూలీల కొరత

- ఊపందుకున్న మిర్చి కోతలు
- పెరిగిన పెట్టుబడులు
- ఆశాజనకంగా లేని ధరలతో రైతుల ఆందోళన


మిరప కాయలను గ్రేడు చేస్తున్న కూలీలు

చీరాల, మార్చి 23: పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో మిరప కోతలు ఊపందుకున్నాయి. దీంతో కూలీల కొరత వెంటాడుతోందని రైతులు అంటున్నారు. ఎండల తీవ్రతతో మిరప కోతలు సక్రమంగా సాగటం లేదు. ఇక కళ్లాల్లో ఉన్న ఆరబెట్టిన మిరపను గ్రేడు చేసేందుకు మనుషులు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇదిలా ఉంటే మిరప ధరలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. రోజువారీ కూలీలకు కూలి చెల్లించాలంటే చేతిలో తగినంత ఆర్థిక వెసులుబాటు లేక ముందస్తుగా వచ్చిన పంటను అయినకాడికి తెగనమ్ముకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు, ఇంకొల్లు, యద్దనపూడి, మార్టూరు మండలాల పరిధిలోని మిరప సాగుదారులు మిరప ధర తగ్గటం పట్ల ఆందోళన చెందుతున్నారు. స్థానికంగా వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు నియంత్రిస్తున్నారని వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుదామంటే గిట్టుబాటు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. దీంతో ప్రధానంగా కౌలుదారులు ఏరోజుకారోజు కూలీలకు కూలి చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు వారాంతపు బట్వాడాకు ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే, ఏరోజుకారోజు డబ్బు ఇచ్చేవారికన్నా వారంతపు చెల్లింపు వారికి కొంత అధిక మొత్తం చెల్లించాల్సి వస్తుందంటున్నారు.

ఇదిలాఉంటే స్థానికంగా కూలీలు సరిపడా దొరకని వారు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను పిలుచుకుంటున్నారు. దీంతో వారి రాకపోకలకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. ఈక్రమంలో కూలీలు కొంతమేర ఆగినా ప్రతిరోజు వాహనాల(ఆటో) బాడుగ చెల్లించాల్సిన పరిస్థితి. ఈ ఏడాది పెట్టుబడులు అంచనాలను మించి అవుతున్నాయని చెప్తున్నారు. ఈక్రమంలో గిట్టుబాటు ధర ఉంటే తప్ప నష్టాలు మూటగట్టుకేనే పరిస్థితేనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అమరవీరులకు నివాళులు

అద్దంకిటౌన్, మార్చి 22: అద్దంకి పట్టణ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం అమరవీరులకు నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ చిత్రపటాలకు ప్రజాసంఘాల సభ్యులు నివాళులర్పించారు. చిన్న వయసులోనే జీవితసుఖాలను పక్కనపెట్టి భారతదేశ ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్రాల కోసం ప్రాణాలర్పించిన విప్లవవీరులు అని కొనియాడారు. కార్యక్రమంలో మనం త్రిమూర్తులు, అన్నమనేని వెంకట్రావు, జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, వీసీహెచ్ కోటయ్య తాళ్ళూరి బాబురావు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: భగత్ సింగ్ 93వ వర్ధంతిని శనివారం మార్టూరులోని గన్నవరం రోడ్డులో సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహమ్మద్ బాషా, సుజాత, ఉప్పలపాటి అచ్చుతరామరాజు, సాయిబాబా, ఖాజా, పఠాన్ బాబు, క్రాంతి సీమ, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పంగులూరు, మార్చి 23: పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. పోషన్ పఖ్వాడ్ కార్యక్రమంలో భాగంగా పంగులూరులో పాఠశాలల విద్యార్థులకు ఆయుర్వేద వైద్యులు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. జంక్ ఫుడ్, శీతల పానీయాల వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలితకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త సరోజిని, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యను హత్యచేసిన భర్త అరెస్ట్

చీరాలటౌన్, మార్చి 23: వేటపాలెం మండల పరిధిలోని రోశయ్య కాలనీకి చెందిన దేవర లక్ష్మీ(35)ని హత్యచేసిన కేసులో భర్త లక్ష్మీనారాయణను టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న వీరికి ఇద్దరు సంతానం. భార్యపై అనుమానం వ్యక్తం చేస్తుండటంతో కుటుంబంలో వివాదాలు జరుగుతున్నాయి. ఈక్రమంలో పథకం ప్రకారం గత బుధవారం గ్రామ శివారు ప్రాంతంలోని పొలాల్లోకి భార్యను తీసుకెళ్లి హతమార్చి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న టూటౌన్ పోలీసులు సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. దీనిపై అధికారికంగా వెల్లడించాల్సి ఉంది.

గోశాలలో గోమాతలకు సీమంతం


గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

మార్టూరు, మార్చి 23: మార్టూరులోని శ్రీకృష్ణ పిరమిడ్ గోసంరక్షణ సేవా సమితిలో శనివారం మహిళలు గోమాతలకు సీమంతం నిర్వహించారు. సేవా సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా గణపతిపూజ, శ్రీకృష్ణ పూజలు, కుంకుమార్చన, గోవులకు సీమంతం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర లక్ష్మీదేవి సమేత శ్రీవేణుగోపాలస్వామి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సెయింట్ ఆన్స్‌లో వర్క్‌షాప్

చీరాల, మార్చి 23: సెయింట్‌ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఏడు రోజుల వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు శనివారం తెలిపారు. వర్క్‌షాప్ ఉపయోగాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపారావు వివరించారు. కార్యక్రమలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

28 మందిపై బైండోవర్ కేసులు నమోదు

బల్లికురవ, మార్చి 23: రానున్న ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా మండలంలోని పలుగ్రామాలకు చెందిన టీడీపీ, వైసీపీ నేతలపై బైండోవర్ కేసులు నమోదు చేసిన్నట్లు తహసీల్దార్ సుభద్ర తెలిపారు. మండలంలోని వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాడు, చెన్నుపల్లి గ్రామాలకు చెందిన 28 మందిని పోలీసులు గుర్తించి వారిపై ముందస్తు బైండోవర్ కేసులకు తీసుకు రాగా కేసులు నమోదు చేసిన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

మద్యం మత్తులో యువకుల మధ్య ఘర్షణ

బల్లికురవ, మార్చి 23: మండలంలోని వేమవరం నాలుగ రోడ్ల కూడలిలో శనివారం మద్యం మత్తులో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వీరిద్దరికి గాయాలు కావటంతో వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకు వెళ్లారు. అందిన సమాచారం మేరకు.. ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన పిన్నిటి నాగరాజు, సోమవరప్పాడుకు కొండవర్తి గోపిరాజులు వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణం ఎదురుగా ఉన్న హోటల్‌లో మద్యం తాగుతున్నారు. ఈక్రమంలో గోపిరాజు సెల్‌ఫోన్‌లో జగన్ పాటలు పెద్దగా పెట్టటంతో పక్కనే మద్యం సేవిస్తున్న నాగరాజు పాటల సౌండ్ తగ్గించాలని అనటంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఒకరికొకరు కూర్చున్న కుర్చీలతో దాడి చేసుకొన్నారు. ఈఘటనలో గోపిరాజు తలకు గాయాలు అయ్యాయి. నాగరాజుకు శరీరంపై రక్త గాయాలు అయ్యాయి. వెంటనే గోపిరాజు అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లగా, నాగరాజు మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. ఘటన జరిగిన వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో బల్లికురవ పోలీసులు విచారణ చేపట్టారు. వైద్యశాలల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు కానున్నాయి.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి


స్వామిత్ సర్వే జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ కన్నబాబు

యద్దనపూడి (వరార్బారం), మార్చి 23: ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు సరైన వసతులు కల్పించాలని పంచాయతీరాజ్ కమిషనర్, స్వామిత్ స్పెషల్ ఆఫీసర్ కన్నబాబు అన్నారు. శనివారం యద్దనపూడి మండలం చిలుకూరివారిపాలెం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పనులు చేస్తున్న కూలీలకు ఏర్పాటుచేసిన వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏపీఎం రమేష్‌కు పలు సూచనలు చేశారు. తొలుత గ్రామంలో స్వామిత్ సర్వే జరిగిన వాటిని కన్నబాబు పరిశీలించారు. కార్యక్రమంలో డీపీవో రవికుమార్, డీఎల్‌పీవో హనుమంతరావు, డ్వామా పీడీ రాజేష్, ఎంపీడీవో శివసుబ్రమణ్యం, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పూరిల్లు దగ్ధం

దేవరపల్లి(పర్చూరు), మార్చి 23: పర్చూరు మండలం దేవరపల్లిలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామాలనికి చెందిన జూపూడి రోశయ్యకు చెందిన పూరిల్లుతోపాటు అందులో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో చుట్టపక్కల వారు ఆర్పేప్రయత్నం చేశారు. మంటలు అదుపు కాకపోవటంతో చీరాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో రూ1.5 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియాల్సి ఉంది.

ఆదరించండి.. అందరివాడిగా సేవచేస్తా!


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

చీరాల, మార్చి 23: వచ్చే ఎన్నికల్లో చీరాల నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తనను ఆదరించాలని ఎంఎం కొండయ్య అన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ అందరివాడిగా సేవచేస్తానని చెప్పారు. స్థానిక బాబా రైస్ మిల్లులో శనివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావల్సిన ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.